# చిదంబర రహస్యం

**-రసరాజు**

ఎమ్మెల్యేగిరి ఎగిరిపోయిన దగ్గర్నుంచి చిదంబరం ఆ మేడ మీద గదిలోనే ఎక్కువసేపు గడుపుతున్నాడు. ఉదయం తొమ్మిదిన్నరకి మేడెక్కితే ఒంటి గంట వరకు అక్కడే. తిరిగి సాయంత్రం అయిదు గంటల వేళలో నౌకరొచ్చి ఆ మేడ గది తలుపు తీస్తాడు. ఏడు గంటల సైరన్ కూశాక గాని చిదంబరం మళ్లీ ఆ మేడ దిగడు. ఆ సమయాల్లో ఒంటరిగా ఆ గదిలో కూర్చొని ఆయనేం చేస్తుంటాడో కొంతకాలం వరకు తెలీదు.

అక్కడ ఒక పెద్ద కిటికీ ఉంది...

అక్కడ కూర్చుంటే వీధిలో జరిగే విశేషాలన్నీ శ్రమ లేకుండా కళ్లల్లో పడతాయి.

ఆయన చేసే పని కూడ అదే...

"పదవి పోయినా మనసు పాడుచేసుకోకుండా ఏకాంతంగా ఆ మేడపై గదిలో గడపటం ఎంత సంయమనం.." అంటూ ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ ఆయన ఆదర్శాన్ని తెగ మెచ్చుకొంటారు.

చిదంబరం ఓసారి ఆ గదిలో కళ్లు మూసుకొని తదేక దీక్షలో ఉండటం నౌకరు సుబ్బయ్య చూశాడు. దానితో వాడెక్కడో ఊదేశాడు. ఇంకేముంది!.. అయ్యగారు ధ్యానంలో ఈదులాడుతున్నారని లోకం కోడై కూసింది.

ఇంట్లో వాళ్లకి అది మంచిదే అనిపించింది. లేకపోతే పదవికి అలవాటైన ప్రాణం పదే పదే బుర్ర గోక్కుంటుందని వాళ్ల భావన. వీధిలోనే కాస్త అవతలగా ఉన్న దాబా అన్నమయ్యది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే ఆయనే.

ఆ దాబా రోడ్డుకి కొంచెం లోపలికి ఉంటుంది.

ఆ ఇంటి ముందంతా సందడే...

వచ్చీపోయే వాహనాలు...

అధికారుల కోలాహలం...

ఏదో విన్నవించుకోవాలన్న ఆశతో రకరకాల జనం..

సిఫారసుల కోసం ఎడాపెడా వాళ్లూ వీళ్లూ..

అన్నమయ్య - విశాలమైన ఆ దాబా అరుగు మీదే కూర్చుని ఆ పనులన్నీ చక్కపెడుతుంటాడు.

○ ○ ○

చిదంబరానికి ఈ మధ్య ఒంట్లో బాగుండటంలేదు.

ఈ వయసులో మేడ మీదికి వెళ్లటం మానేయమన్నారు ఇంట్లో వాళ్లు.

అయినా అడపా దడపా మాట నెగ్గించుకొని మేడ మీది గదిలోకెళ్లి కిటికీ ఎదురుగా కూర్చోవటం మానలేదు. ఎందుకో ఆయన అక్కడికి వెళ్లకుండా ఉండలేకపోతున్నాడు.

నౌకరు సుబ్బయ్య ఎప్పుడూ ఆయన వెంటే ఉంటున్నాడు. అది పెదబాబు ఆజ్ఞ. పెదబాబు చిదంబరం పెద్ద కొడుకు. ఊరి చివర పెద్ద ఫ్యాక్టరీకి అతనే యజమాని. మూడువేల మందికి ఆ ఫ్యాక్టరీ వల్లే జీవితం గడుస్తోంది. అదికాక సిటీలో మరో రెండు సినిమా హాళ్లున్నాయి. అక్కడక్కడా భూములున్నాయి. ఆ రోజు చిదంబరాన్ని సిటీ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. వైద్య బృందం అన్ని పరీక్షలూ చేసి "ఏదీ లేదు.." అని తేల్చి చెప్పేసింది. అయితే ఆయన రోజురోజుకీ ఎందుకంతగా నీరసించి పోతున్నారో ఇంట్లో వాళ్లకి అంతుబట్టడంలేదు. రెండు రోజులాగి- ఎందుకైనా మంచిదని అమెరికాకు ఫోను చేశారు. పెదబాబు కొడుకు సుమంత్ అక్కడుంటున్నాడు.

సంక్రాంతికి అతనెలాగూ ఇక్కడికి వస్తాడు.

ఇది తెలీగానే సుమంత్ ఓ వారం రోజులు ముందుగానే ఇండియా చేరుకొన్నాడు.

తాతను చూశాడు...

అతనికి ఏవీ అర్థం కాలేదు.

ఎన్నో విషయాలు తాతను గుచ్చి గుచ్చి ఏకాంతంగా ఉన్నప్పుడు అడిగాడు.

ఆ పెద్దాయన ఏవీ చెప్పలేకపోయాడు.

రెండు రోజులు గడిచాక అమెరికాలో ఉన్న వైద్య స్నేహితునితో సంప్రదించాడు.

ఆ సలహాలన్నిటినీ సుమంత్ పరిగణనలోకి తీసుకొన్నాడు. మరుసటి రోజు ఉదయం-

ఎవరూ లేకుండా చూసి "ఓసారి మేడమీదకెళ్లొస్తా..." అన్నాడు చిదంబరం మనవడితో. ఆ రోజు ఇంట్లో వాళ్లంతా ఏదో పనిపై సిటీకి వెళ్లారు.

"వెళ్లు తాతయ్యా... దానికేముంది... ఎవరన్నా వెళ్లొద్దన్నారా..?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు సుమంత్.

చిదంబరానికి కొంత ఊరట కల్గినట్లయింది - మనవడి మాటతో.

తాతను తనే మేడపైకి ఎక్కించి, గదిలో కూర్చోపెట్టి బయటికొచ్చేశాడు సుమంత్.

చాటుగా గదిలో ఆయన వ్యవహారాన్ని పరిశీలింప సాగాడు. అలా నాలుగు రోజులు ఆ పరిశీలన సాగింది.

○ ○ ○

చిదంబరం మేడ దిగి భోజనాల గదిలో కూర్చొని ఉండగా "పెద్దయ్యగారూ... తమ కోసం ఎవరో

## తొలినామం

దీపకరాగం
దీపాలు వెలిగించిందో లేదో తెలీదు కాని
మృత్యురాగం మాత్రం
మా కళ్లల్లో 'తోడి' విత్తుల్ని నాటి వెళ్లింది
కోటికోయిలల మధుర స్వరాల్ని మోసిన
గంధర్వ కంఠాన్ని కాలం గతంలోకి
ఎలా లీనం చేసుకుందో?
మహతి, కచ్ఛపిని మించి జయించిన
ఆ మస్తిష్క తంత్రుల్ని
మరణం ఎలా మోయగలుగుతుందో?
సరిగమలికి శతకోటి తేనెనదుల్లో
తీర్థస్నానం చేయించిన రాగవీణా!
దేవుడైనా కన్నీళ్లు కార్చివుంటాడు 'భైరవి'లో
మృత్యువుని సృష్టించిన పాపానికి నిష్కృతిగా.
ఇప్పుడు కచ్చేరీల్లో 'కళ్యాణి' విన్పించటం లేదు
హృదయ లిపిలో వాకగీతం
శోక మూర్ఛనలు పోతూ తాళం వేస్తుంది
వాకే వొక్క మరణం
తరాల జ్ఞాపకమై ప్రవహిస్తుంది
కాల దేహం మీద భవిషత్ పాదముద్రలతో
'కౌసల్యా సుప్రజా రామా' అంటూ
వాక తొలి తరంగం ఎగిసి పడగానే
ఏడుకొండల కావల పులికిపడి
నిద్రలేచిన దేవుడు సైతం
తలచుకొనే తొలినామం 'ఎం.ఎస్'!

**-ఈతకోట సుబ్బారావు**

## కొత్త రంగులు అద్దండి

వర్షానికి మనం హర్షించడం ఇష్టం లేనట్లుంది.
దానికి కేవలం మనల్ని బాధించడమే తెలిసినట్లుంది
అసలే రాక జీవితాల్ని ఎడారులుగా మారుస్తుంది
ఒకోసారి దొంగదాడికి దిగి న్వరాన్ని
తుడిచిపెట్టుకుపోతుంది.
ఈ వానకీ రాజకీయం అబ్బినట్టుంది
రైతుకు తలవంచడం మాని
రాజకీయానికి (మేఘమథనం పేరుతో)
తలవంచుతోంది
కరువొచ్చినా వరదొచ్చినా ఎటొచ్చీ బాధంతా మనకే
ఖద్దరు బాబులకు మాత్రం సరదా అనునిత్యం
దసరా
"రైతురాజు" అన్న మాటకు అర్థం మారింది
రైతుకు కన్నీరు, 'రాజు'కు మొసలి కన్నీరు
కార్చడానికి తప్పు!
మనం అమాయకులం కాకపోతే
ఐదేళ్లకోసారి దేబిరింపు చూపులతో
ఒంటి మీద చిరుగుల మాటల తువ్వాలు కప్పుకొని
బుసకొట్టే చేతుల్ని బుద్ధిగా కట్టుకొని
వంగి వంగి సలాము చేస్తూ వస్తే
చచ్చినట్టు మనం జాలిపడతాం కదా!
వాడి చిప్పలో 'ఓట్లు' వేసి చేతులు దులిపేసుకుంటాం కదా!
ఇప్పుడు రాజకీయ చిత్రం మారబోతుంది
అలిగి మూలన కూర్చున్న మేధావులు
ఇప్పుడిప్పుడే నడుం బిగిస్తున్నారు
మానవత్వాన్ని అక్కున చేర్చుకునే వాళ్ళు
ఆవేశపడుతున్నారు
చలించడం మరిచిపోయినవారి మెదళ్ళకు
నిప్పంటించేందుకు కుంపటి రాజేస్తున్నారు
'కుళ్ళు'ను సమాధి చేసేందుకు
గడ్డపారలకు మొనలు పెట్టిస్తున్నారు
ఓటరులారా! మారబోయే చిత్రానికి "కొత్త రంగులు
అద్దండి".
వర్షమా! రైతు పెదాలపై నిత్యం అందమైన నవ్వును
పూయించు
(జయప్రకాశ్ నారాయణ రాజకీయ రంగ
ప్రవేశానికి ఆనందంతో...)

**-కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి**

వచ్చారు..." అన్నాడు సుబ్బయ్య.

"నా కోసం ఎవర్రా..." అంటూ చిదంబరం భోంచేసి బయటికొచ్చాడు.

సైదులు చేతులు కట్టుకొని చిదంబరం ఎదురుగా నిలబడ్డాడు.

"ఏవిట్రా విశేషం..." చిదంబరం అడిగాడు.

"ఏవీ లేదయ్యగారూ... పట్నం ఆఫీసులో చిన్న పనుంది... తమరో మాట సెపితే..." అన్నాడు సైదులు.

## బతుకు సెలవు చీటి

ఆత్మాహుతి దాడులతో
దేహాలను చితాభస్మం చేసుకుంటూ
ఎందుకు సిద్ధపడతారో తెలీదు.
పసిరెక్కల ఉనికికీ స్వరముండదు
నడి వయస్కుల జాడకీ పలుకుండదు
శవాల గుట్టల్లోంచి
తొంగిచూసే ఆర్తనాదాల మధ్య,
క్షతగాత్రుల మృతనినాదాలే
నిలువెత్తు సందర్భాలుగా దర్శనమిస్తాయి.
సిద్ధాంత రాద్ధాంతాల్లోంచి
దరిచేరని బతుకు చిరునామా విపత్తుల వరకూ
విస్ఫోటనంతో యుద్ధాగ్రహాన్ని ప్రకటించడమే
ఈనాటి కాల ధర్మమేమో!
రక్తపుటేరులను పారించడమే
నరహంతకుల అంతిమ లక్ష్యమేమో!
విధ్వంసాన్ని సృష్టించడం క్షణికం
విషాద భారాన్ని మోసేది జీవితాంతం
చూసే చూపులోనూ
వేసే అడుగులోనూ
మారణకాండగా వెలిగి పోవాలనుకోవడం
ఎవరి స్వార్థంకోసమో?
ఎన్నెన్ని వేదనల సమాహార దృశ్యరూపమో?
ప్రయోజన రాహిత్యమైన ఈ ప్రయాణం
ఫలితాన్నే ఇస్తుందో
నిష్ఫలమై వికటిస్తుందో
కొసలు తెగి ప్రవహిస్తున్న
విధ్వంస నేపథ్యమే బదులు చెప్పాలి.
అంతర్మథనం చేసుకుంటేనే కదా
సమస్యకు పరిష్కారం దొరికేది
మనిషికైనా!
మానవ మృగానికైనా!
భవిష్యత్తుకు ఎప్పుడూ
కొత్తదారులు తెరిచే ఉంటాయి
వాటిని కాపాడుకోవడంలోనే
మనుగడ ఆధారపడి ఉంది
కాదనుకుంటే
పరిస్థితి మామూలే...
ఈ మార్గం
ఎప్పటికీ వీడని
ఒక చిక్కుప్రశ్నగానే మిగిలిపోతుంది!!

-మానాపురం రాజాచంద్రశేఖర్

"ఇప్పుడు నా మాటెవరింటార్రా... ఎమ్మెల్యేని కాదుగా... అన్నమయ్య గారి దగ్గరికి పోలేకపోయావా..." అన్నాడు చిదంబరం.

"కాదయ్యగారూ... మీ విలువ మీదే... ఓ కాగితం రాసివ్వండి..." అంటూ ప్రాధేయపడ్డాడు సైదులు.

పనేమిటో తెలిసికొని చిదంబరం ఉత్తరం రాసి చ్చాడు.

ఆ సాయంత్రం–

గణపతి ఇద్దర్ని వెంట పెట్టుకొని చిదంబరం దగ్గరి కొచ్చాడు.

చిదంబరం అప్పుడే నిద్రలేచి టీ త్రాగుతున్నాడు.

ముందు నమస్కారం చెప్పి గణపతి వచ్చిన పని విన్నవించాడు.

"నీరసంగా ఉంటుంది... రాలేనేమో..." అన్నాడు చిదంబరం.

"మాకు సెంటిమెంట్ సార్... మీరు అడుగుపెడితే మా వ్యాపారం బాగుంటుంది... అన్నమయ్య గారు కూడా వస్తున్నారు... మీ చేత్తో సేల్స్ విభాగాన్ని ప్రారంభిం చాలి..." గణపతి గట్టిగా పట్టుపట్టాడు.

"తాతయ్యా! ఒప్పేసుకో.. వెనకాల నేనున్నాగా..." అన్నాడు సుమంత్ ధైర్యం నింపుతూ.

గణపతి సుమంత్‌కి చిరకాల మిత్రుడు.

మరుసటి రోజు–

టిఫిన్ ముగించుకొని హాల్లోకి వచ్చేసరికి చిదంబరం కళ్లల్లో రోడ్డు మీదున్న రెండు కార్లు కనిపించాయి.

"ఎవర్రా అది" అని అడిగాడు చిదంబరం సుబ్బ య్యని.

"తమకోసమే అయ్యగారూ... మన ఫ్యాక్టరీలో పని చేసే జీయమ్‌గారి బంధువులట..." సుబ్బయ్య అలా అంటుండగానే ఆరుగురు వ్యక్తులు హాల్లోకి ప్రవేశించారు.

"నమస్కారం సార్... జీయమ్ కాశీగారి బావమరిది నండీ..." వచ్చిన వాళ్లలో ఓ వ్యక్తి రెండడుగులు ముందుకేసి పరిచయం చేసుకొన్నాడు.

ఆ ఆరుగుర్నీ కూర్చోమని చెయ్యి చూపించాడు చిదం బరం.

"మా ఊళ్లో చిన్న గుడి కడుతున్నామండీ... శంకుస్థాపన చేయాలి మీరు..."

"ఏ ఊరు?..." చిదంబరం అడిగాడు.

వాళ్లు చెప్పారు...

"మీ ఎమ్మెల్యే గారుండగా నేను రావటం అంత బాగుండదేమో..." చిదంబరం తన అభిప్రాయాన్ని వాళ్లముందుంచాడు.

"వారినీ పిలిచామండి.. ఎప్పట్నుంచో ఈ విష యంలో మిమ్మల్నే అనుకొన్నాం.. మీ పేరు ఆ ఫలకం మీదుండాలి..." వాళ్లు అభ్యర్థించారు.

"సరే..." అని ఆ విషయాన్ని ఆ తరువాత డైరీలో వ్రాసుకొన్నాడు చిదంబరం.

ఆ రాత్రి తాతగారి దగ్గర కూర్చొని ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెపుతూ "ఎలా ఉంది ఒంట్లో..." అన్నాడు సుమంత్.

"ఎందుకో నీరసం కొంచెం తగ్గిందిరా. నీ అమెరికా స్నేహితుడు చెప్పిన బిళ్లలు బాగా పనిచేశాయేమో..." అన్నాడు చిదంబరం.

"అవిక్కడ దొరకవు తాతయ్యా... బొంబాయి ఫోను చేసి ఫ్లయిట్‌లో తెప్పించా..." అన్నాడు సుమంత్ డాక్టర్‌లా తాతయ్య నాడిని పట్టుకొంటూ.

"ఎలా ఉందిరా చెయ్యి..." చిదంబరం అడిగాడు.

"నీ నాడికేవిటి తాతయ్యా.. వాడిగా ఉంది..." అంటూ ఛలోక్తి విసిరాడు సుమంత్.

మళ్లీ ఆ మరుసటి రోజు మధ్యాహ్నం ఏదో సభకు అధ్యక్షత వహించాలని ఎవరో చిదంబరం కోసం వచ్చారు. ఆ తరువాత మరెవరో తగవు తీర్చాలని ఆయన్ని ఇబ్బంది పెట్టారు.

"ఏవిట్రా... వారం రోజుల నుంచీ ఈ వరస... ఎవరెవరో చిన్నదానికో పెద్దదానికో వచ్చిపోతూనే ఉన్నారు..." అన్నాడు చిదంబరం.

"వారం రోజుల్నుంచే కాదు తాతయ్యా... ఇంతకు ముందు నుంచి కూడ ఇలా వస్తూనే ఉన్నారు... నీకీ వయసులో విశ్రాంతివ్వాలన్న ఉద్దేశంతో వచ్చిన వాళ్లని వచ్చినట్టే అలా పంపిచేస్తున్నారట మనవాళ్లు..." అన్నాడు సుమంత్ కల్పనలో చాతుర్యం చూపిస్తూ.

"అది నాకు తెలీదే..." అన్నాడు చిదంబరం తల పైకెత్తి ఆశ్చర్యంగా.

"నీ ఆరోగ్యం ముఖ్యం కదా... అమ్మకీ నాన్నకీ ఫర్వాలేదని నేనే నచ్చచెప్పి విజిటర్స్‌ని కలిసే ఏర్పాటు చేశా..." అన్నాడు సుమంత్.

అలా ప్రతిరోజూ ఎవరో ఒకరు రావటం, రెండు మూడు కార్లు ఇంటి ముందాగటంతో – చిదంబరానికి పూర్వవైభవం మళ్లీ తిరగతోడినట్లయింది.

❍ ❍ ❍

చిదంబరం ఇప్పుడు అమెరికాలో ఉన్నాడు – సుమంత్ దగ్గర.

"చూశారా సుమంత్ తెలివితేటలు... అందుకే అమెరి కాలో సైకాలజిస్ట్‌గా అంత మంచి పేరు తెచ్చుకొన్నాడు... మావయ్య గారికి పదవి పోవటం... దానితోటే ఆ వైభవం కాస్తా పక్కదారి పట్టటం.. ఆయన స్థానాన్ని మరొకరు ఆక్రమించటం.. అదంతా రోజూ మేడమీద గదిలోంచి చూసి ఆయన బాధపడటం... ఇవన్నీ మానసిక శాస్త్ర వేత్తగా అబ్బాయి కనిపెట్టి క్రుంగిపోతున్న పెద్దాయన మనస్సుని ఓ దారికి తేవటం మామూలు విషయమా... ఆయన్ని మనమంతా గదిలో ఏకాంతంగా గడుపుతున్న మౌనస్వామి లాగే భావించాం తప్ప... లోలోపల ఇంత బెంగతో ఉన్నారని తెలుసుకోలేకపోయాం... పదవి మనిషిని ఎంతగా వశపర్చుకొంటుందో చూడండి... అదే జారిపోతే పిచ్చి తలకెక్కి ఎలా నాట్యం చేస్తుందో మావగార్ని చూస్తే తెలిసింది. ఇంత సంపదున్నా పదవి ఎంత ప్రభావం చూపిస్తుందో చూడండి.. తన మిత్రుల్నీ ఫ్యాక్టరీ జనాన్ని కలుపుకొని ఈ పదిహేను రోజుల్లోనూ సుమంత్ ఎన్నెన్ని నాటకాలాడించాడో... అటు శంకుస్థాప నలనీ.. ఇటు ప్రారంభోత్సవాలనీ... ఏమైతేనేం మావ గారు మళ్లీ మనిషయ్యారు. అబ్బాయి పుణ్యమా అని..." అంటూ సుమంత్ తల్లి "చిదంబర" రహస్యం ఛేదింప బడ్డందుకు గర్వంగా భర్త కళ్లలోకి చూసింది.

ఆ మాటతో సుమంత్ తండ్రి కూడ మరింత గర్వంగా మీసంపై చేయివేసి భార్య వంక చూశాడు "చూశావా! ఎటువంటి బిడ్డకు కష్టపడి నిన్ను తల్లిని చేశానో..." అన్నట్లు.

■